# ప్రాణాలతో రెడీమిక్స్ చెలగాటం

- జనావాసాల మధ్య విచ్చలవిడిగా ప్లాంట్లు
- పచ్చని పొలాలన్నీ కనుమరుగు
- పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు
- దుమ్ము, ధూళితో అల్లాడుతున్న మణికొండ
- బడా నిర్మాణ సంస్థల తీరుపై ప్రజాగ్రహం



పొల్యూషన్ బోర్డు అధికారులకు విన్నవిస్తున్న బాధితులు



ఆర్ఎంసీ ప్లాంట్‌ను మూసివేయించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు విన్నవిస్తున్న స్థానికులు



వాసవీ అట్లాంటిస్ నిర్మాణరంగ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ప్లాంటు

మణికొండ, నవంబర్ 20: నిర్మాణరంగ సంస్థలు ఇష్టానుసారం జనావాసాల మధ్య ఏర్పాటుచేస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలోని నార్సింగి/మణికొండ మున్సిపాలిటీల పరిధిలో కొంతమంది బడా బిల్డర్లు నిబంధనలను పట్టించుకోకుండా జనావాసాల మధ్యనే రెడీమిక్స్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇలాంటి వాటిని తక్షణమే మూసివేయించాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం స్థానికులకు శాపంగా మారుతున్నది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఒక నిర్మాణరంగ సంస్థ జనావాసాల మధ్యనే రెడీమిక్స్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నది. వాసవీ అట్లాంటిస్ పేరుతో క్యాప్టివ్ రెడీమిక్స్ ప్లాంట్‌ను 2021లో స్థాపించారు. ఈ ప్లాంట్ నుంచి వెలువడే దుమ్ము, ధూళి సమస్యగా మారిందంటూ స్థానికులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి అధికారులు వాటిని మూసివేయాలంటూ నోటీసులు జారీచేశారు. కొన్నాళ్లు పనులను నిలిపివేసిన యాజమాన్యం తిరిగి 2023లో మళ్లీ అదే రెడీమిక్స్ ప్లాంట్‌ను స్థాపించి, తమను అవస్థలకు గురిచేస్తున్నదని మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా అపార్టుమెంట్ వాసులు వాపోతున్నారు. గత పదినెలలుగా ఈ ప్లాంటును మూసివేయాలంటూ కాలుష్య నియంత్రణ మండలికి విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని చెప్తున్నారు. ఈ ప్లాంట్ నుంచి వెలువడే దుమ్ము, ధూళి 100-150 మీటర్ల దూరంలో ఉన్న బహుళ అంతస్తుల టౌన్‌షిప్‌లు, హౌసింగ్ కాంప్లెక్స్‌ల మీద సైతం ప్రభావం చూపుతున్నది. ఆర్ఎంసీ ప్లాంట్లు తమ ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా 200 మీటర్ల దూరంలో ఉన్న చెట్లు, జంతుజాలంపై కూడా ప్రభావం చూపుతున్నదని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రవహించే సహజ నీటి వనరు పూర్తిగా కలుషితమవుతున్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



ఆర్ఎంసీ ప్లాంట్ల వాహనాలు నడుపుతుండటంతో ఛిద్రమైన రహదారి

### కిమ్మనని పీసీబీ, రెవెన్యూ శాఖలు

అల్కాపూర్ టౌన్‌షిప్, పుప్పాలగూడ, ల్యాంకోహిల్స్, ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్ రహదారి, మైహోం అవతార్ వెనుక, ముప్పా అక్షజ అపార్టుమెంట్ ఎదురుగా అనేక ప్రాంతాల్లో రెడీమిక్స్ ప్లాంట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు యంత్రాంగం చేతులెత్తేసిందని స్థానికులు మండిపడుతున్నారు. పీసీబీ నోటీసులు జారీచేసినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నిర్మాణదారులు ఎక్కడపడితే అక్కడ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీటి నుంచి నిత్యం వెలువడే దుమ్ము, ధూళి కారణంగా శ్వాసకోశ వ్యాధులతో రోగాల బారిన పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల మణికొండ మున్సిపాలిటీ సిటీకౌన్సిల్ ప్రతినిధులతో కలిసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు మరోసారి విన్నవించగా, నిర్మాణదారులతో పాటు స్థానిక ప్రజలతో కలిసి పీసీబీ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో రెడీమిక్స్ ప్లాంట్‌ను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పుడు స్పందించడం మానేశారంటూ హాల్‌మార్క్ విసినియా నివాసితుడు గౌతం కృష్ణ తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనకు దిగుతామని చెప్పారు. అయినా సదరు నిర్మాణ రంగ సంస్థ తమ పలుకుబడిని ఉపయోగించి రెడీమిక్స్ ప్లాంట్లను రాత్రింబవళ్లు నడుపుతూనే ఉన్నది.

### ఏవీ కోనసీమ అందాలు?

పశ్చిమగోదావరి జిల్లాలోని అందాలను తలపిస్తూ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలు పచ్చని పొలాలకు నెలవుగా ఉండేవి. రెడీమిక్స్ ప్లాంట్ల ఏర్పాటుతో ఈ ప్రాంతాల్లో వ్యవసాయం కనుమరుగైంది. వ్యవసాయ క్షేత్రాలు బీడు భూములుగా మారిపోయాయి. ఫలితంగా ఈ ప్రాంతంలో అన్నదాతలు కూలీలుగా మారిపోతున్నారు. వట్టినాగులపల్లి, ఖానాపూర్ గ్రామాల్లో నిత్యం రహదారులన్నీ దుమ్ము రేగుతూ దర్శనమిస్తున్నాయి. వీటిని తక్షణమే నిలిపివేయాలంటూ ఇరు గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

### ఆర్ఎంసీ ప్లాంట్లతో కాలుష్యం

ఆర్ఎంసీ ప్లాంట్ల ఏర్పాటుతో కాలుష్య నియంత్రణ మండలి లెక్కల ప్రకారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వాయి నాణ్యతా నమోదు క్రమంగా తగ్గిపోతున్నది. పీఎం 10 ధూళి కణాల స్థాయి అధికంగా విడుదలవ్వడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. నిర్మాణ రంగంలో కార్యకలాపాలు, ఆర్ఎంసీ యూనిట్ల నుంచి వెలువడే దుమ్ము కణాలతోనే వీటి సూచీ పెరుగుతున్నదని పీసీబీ అధికారులు వెల్లడించారు. 15 రోజుల్లో కేవలం నాలుగు రోజులు మాత్రమే వాయు నాణ్యత సూచీ 100లోపు నమోదు కాగా మిగిలిన రోజుల్లో 105 నుంచి 153 మధ్య నమోదు అవుతున్నట్టు తెలిపారు.

### ఆర్ఎంసీ ప్లాంట్‌ను త్వరలోనే నిలిపివేస్తాం

"గత కొన్నిరోజులుగా స్థానిక ప్రజల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. వాటిపై స్పందించిన పీసీబీ అధికారులు నోటీసులు జారీచేశారు. త్వరలోనే మూసివేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి పనులను నిలిపివేశాం.

-విజయ్‌కుమార్, వాసవీ నిర్మాణరంగ సంస్థ యజమాని

### నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా పట్టింపేది?



వాసవీ అట్లాంటిస్ నిర్మాణ రంగ సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్ఎంసీ ప్లాంట్‌ను నడుపుతున్నది. ఫలితంగా పక్కనే ఉన్న నివాసితులంతా దుమ్ము, ధూళితో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇంత దారుణమైన పరిస్థితులు మరెక్కడా లేవు. ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనడమే పాపమైంది. కొత్తగా కొనాలనుకొనేవారు ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనకపోవడమే ఉత్తమం.

- గౌతం కృష్ణ, హాల్‌మార్క్ విసినియా నివాసితుడు

### ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవాలి



మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా అపార్టుమెంట్లలోని దాదాపు 15,000 మంది జనాభా రెడీమిక్స్ ప్లాంట్ల వల్ల నిత్యం అవస్థపడుతున్నాం. కొన్నిరోజులుగా కొన్ని భవన నిర్మాణ సంస్థలకు చెందిన ప్లాంట్లను ఇక్కడ ఏర్పాటు చేసి ప్రజలను అనారోగ్యాలకు గురిచేస్తున్నారు. దీనిపై మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు సైతం విన్నవించాం. వారు స్పందించకపోతే ఆందోళనలకు దిగుతాం. రెడీమిక్స్ ప్లాంట్ల యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే చూస్తూ ఊరుకోలేం.

- అందె లక్ష్మణ్‌రావు, సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధి

## ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై స్పందించరేం..

- సీఎం రేవంత్‌రెడ్డిపై ఆటో జేఏసీ ఆగ్రహం
- నేడు బషీర్‌బాగ్‌లో ఆటోడ్రైవర్ల రాష్ట్రసదస్సు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 20 ( నమస్తే తెలంగాణ ): ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై హనుమకొండ లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, ఏఐటీయూసీ నాయకుడు వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. నాచారంలో వారు మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలపై మాట్లాడే సమయం లేని సీఎంకు కేటీఆర్ వేసుకున్న డ్రైవర్ల(ఖాకీ)చొక్కాపై విమర్శలు చేయడానికి మాత్రం సమయం ఉన్నదని విమర్శించారు. డ్రైవరన్నల జీవితాలను బలితీసుకుంటున్న కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల రాష్ట్రసదస్సు గురువారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని సంఘాల ప్రధాన నాయకులు పాల్గొంటారని, అక్కడే తమ ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది ఏడుగురు ఐపీఎస్‌ల రిటైర్మెంట్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): వచ్చే ఏడాది తెలంగాణ నుంచి ఏడుగురు ఐపీఎస్ అధికారులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. వారిలో ముగ్గురు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హోదా కలిగిన సీనియర్ ఐపీఎస్‌లు, మరో నలుగురు ఐపీఎస్ అధికారులు ఉన్నారు. వారిలో ప్రస్తుత డీజీపీ డాక్టర్ జితేందర్, మాజీ డీజీపీ, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా, రాష్ట్ర విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉన్నారు. వీరితోపాటు సీనియర్ ఐపీఎస్‌లు వీబీ కమలాసన్‌రెడ్డి, డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వీ సత్యనారాయణ, పీ విశ్వప్రసాద్ ఉన్నారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలల మధ్య వీరి ఉద్యోగ విరమణ షెడ్యూల్ ఉన్నది.



దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని తెలుసుకుంటున్న పోలీసులు



మహబూబ్‌నగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థులు

# వికటించిన మధ్యాహ్న భోజనం

**100 మంది విద్యార్థులకు అస్వస్థత • వారిలో 15మంది పరిస్థితి విషమం • నారాయణపేట జిల్లా మాగనూరులో ఘటన**

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి, 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ డాక్టర్‌ను స్కూల్‌కు పిలిపించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆ తర్వాత విద్యార్థులను మక్తల్ ఏరియా దవాఖానాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న 15 మందిని మహబూబ్‌నగర్‌లో పెద్ద దవాఖానాకు తరలించారు. బుధవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అన్నం, పప్పు, గుడ్డు వడ్డించారు. భోజనం తిన్న కాసేపటికే విద్యార్థులంతా అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను బెదిరించి, ఇండ్లకు వెళ్లాలని సూచించారని, వెళ్లిన వారిలో చాలా మంది ప్రైవేటు దవాఖానాల్లో చికిత్స పొందుతున్నారని తోటి విద్యార్థులు తెలిపారు. డీఈవో అబ్దుల్‌ఘనీ స్కూల్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ జరగడం ఇది మూడోసారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డీఈవోను డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శ్రీహరి బడిని పరిశీలించారు, మక్తల్ దవాఖానాకు వెళ్లి, చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మాగనూరు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆరా తీశారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

### సీఎంను కదిలించిన హరీశ్ ట్వీట్లు

మాగనూర్ జెడ్పీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మాజీమంత్రి హరీశ్‌రావు వరుస ట్వీట్లు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కదిలారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు, కుక్కకాట్లు, పాము కాట్లు, ఎలుక కాట్లు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది.

## మల్లారెడ్డి విద్యాసంస్థలకు డీమ్డ్ వర్సిటీ హోదా

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): మల్లారెడ్డి విశ్వవిద్యాలయ పీఠ్ (సూరారం)కు డీమ్డ్ వర్సిటీ హోదా కల్పిస్తూ కేంద్ర విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులిచ్చింది. మల్లారెడ్డి విద్యాసంస్థలకు చెందిన ఫార్మసీ, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ సైన్సెస్, మహిళా మెడికల్ కాలేజీ, మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్, మల్లారెడ్డి డెంటల్ కాలేజీ, మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీలతో కొత్త గా డీమ్డ్ వర్సిటీని ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను జారీచేసింది. ఈ వర్సిటీలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు పొందేందుకు అవకాశముంటుంది.

## టెట్‌కు 2.48లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 2.48లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కు 71వేలు, పేపర్-2కు 1.55లక్షలు, రెండు పేపర్లకు కలిపి 20వేల మంది చొప్పున మొత్తంగా 2.48లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.టెట్‌లో దొర్లిన తప్పులను 22లోపు సవరించుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు.

## ఖాళీ కడుపుతో స్పెషల్ క్లాసులకు!

- పదో తరగతి విద్యార్థుల అర్ధాకలి
- ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో విద్యార్థుల ఇక్కట్లు
- అల్పాహారం సమకూర్చడంలో రేవంత్ సర్కారు విఫలం

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : సర్కారు స్కూళ్లల్లోని పదో తరగతి విద్యార్థులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గాలికొదిలేసింది. స్పెషల్‌క్లాసులని హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల కడుపుమాడ్చుతున్నది. రాష్ట్రంలో 4,701 ఉన్నత పాఠశాలు, 194 మాడల్ స్కూళ్లకు చెందిన 1.8లక్షల మంది పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 1 నుంచి ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక క్లాసులను నిర్వహిస్తున్నారు. డిసెంబర్ నుంచి రెండు పూటలా స్పెషల్ క్లాసులు నిర్వహిస్తారు. వీటికి హాజరయ్యే విద్యార్థులకు గతంలో స్నాక్స్ ఇవ్వగా, నేడు అందించడంలేదు. దీని ప్రభావంతో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంటున్నది. విద్యార్థుల పరిస్థితిని చూడలేక టీచర్లు, హెచ్ఎంలే తలాకొంత వేసుకుని ఆకలితీర్చాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొన్ని స్కూళ్లల్లో దాతలు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధుల సహకారంతో స్నాక్స్‌ను సమకూరుస్తున్నారు.

### కేసీఆర్ హయాంలో పౌష్టికాహారం

పదో తరగతి విద్యార్థుల ఆకలితీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవను తీసుకుంది. పదో తరగతిలో విద్యార్థులకు ఉచితంగా స్నాక్స్‌ను సమకూర్చింది. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున రూ.9. 67 కోట్లు ఖర్చుచేసింది. ప్రోటీన్లతో కూడిన ఉడికించిన శనగలు/ బొబ్బర్లు,/అనుములు/పల్లీలు.. పల్లీలు బెల్లంముద్దలు, ఉడికించిన కోడిగుడ్లు, సమోసాలు, పకోడి, అరటిపండ్లు వంటి వాటిని సమకూర్చారు. రాష్ట్రంలో పభుత్వం మారడంతో స్నాక్స్ పథకం అటకెక్కింది.

### బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్

కాంగ్రెస్ సర్కారు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా నిలిపివేసింది. ఇటీవలే సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో దాత (ఓ ఫార్మా కంపెనీ) సహకారంతో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్రమంతటా నిలిచిపోగా, ఒక్క కొడంగల్‌లోనే బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలవుతున్నది. మాడల్ స్కూళ్లల్లో 95%, కేజీబీవీల్లో 93%, ఎయిడెడ్‌లో 88%, జడ్పీ స్కూళ్లల్లో 80% ఉత్తీర్ణత నమోదయ్యింది. ఈ ఏడాది బ్రేక్‌ఫాస్ట్ అమలుకాకపోవడం, మరో వైపు స్నాక్స్‌ను సమకూర్చకపోవడంతో దీని ప్రభావం ఫలితాల మీద పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## కాలేజీలు మూసేసినా పట్టించుకోరా?

- కాంట్రాక్టర్ల బిల్లులిస్తరు.. విద్యార్థులకు ఫీజులివ్వరా?
- తక్షణమే నిధులు విడుదల చేయాలి : ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, నవంబర్20 (నమస్తే తెలంగాణ): కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులను చెల్లిస్తున్న ప్రభుత్వానికి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించేందుకు మాత్రం నిధులు లేవా? అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. కాలేజీలు బంద్ పెట్టి ధర్నాలకు దిగుతున్నా సర్కారు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. బకాయిలు చెల్లించాలని మంత్రులు, అధికారులను కలిసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. బిల్లుల కోసం రెండు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 1800 ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కాలేజీలకు తాళాలు వేయడం 76ఏండ్లలో ఎప్పు డూ జరగలేదని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పిల్లలు చదువుకునే కాలేజీలను మూసివేస్తే ప్రభుత్వం పట్టించుకోదా అంటూ నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పాఠశాలలా? నరక కూపాలా?

- సీఎం నిర్లక్ష్యం ఖరీదు 42 మంది పిల్లల ప్రాణాలు
- కాంగ్రెస్ సర్కార్‌కు పేద విద్యార్థులంటే పట్టదా?
- ప్రగల్భాలు కాదు సౌకర్యాలు కల్పించండి : హరీశ్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'గురుకులాలా లేక నరకకూపాలా? ప్రభుత్వ పాఠశాలలా లేక ప్రాణాలు తీసే విషవలయాలా?' అని బుధవారం ఎక్స్ వేదికగా నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం ఖరీదు 42 మంది విద్యార్థుల ప్రాణాలు అని ఆవేదన వ్యక్తంచేశారు. 'వాంకిడి గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై ఓ విద్యార్థిని 20 రోజులుగా నిమ్స్ దవాఖానలో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నది.బుధవారం నల్లగొండ జిల్లాలో పాముకాటుకు గురైన విద్యార్థి దవాఖానలో చికిత్స పొందుతున్నడు. ఇప్పుడు నారాయణ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 50 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. రాష్ట్రంలోని గురుకులాల్లో, ప్రభుత్వ పాఠశాలలో అసలేం జరుగుతున్నది?. పాఠాలు నేర్చుకోవడం కాదు ప్రాణాలతో బయటపడితే చాలు అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది. రేవంత్‌రెడ్డీ.. ఇందుకేనా మీరు విజయోత్సవాలు జరుపుకొంటున్నది? మీ నిర్లక్ష్యపూరిత వైఖరికి ఇంకెంతమంది విద్యార్థులు బలికావాలి?' అని నిప్పులు చెరిగారు. 'దవాఖానల పాలైన విద్యార్థులను హైదరాబాద్ తరలించి మెరుగైన వైద్యం అందించాలి.. విద్యాశాఖ ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు పలకడం కాదు గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యాబోధన జరిగేలా చూడాలి' అని డిమాండ్ చేశారు. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు తన వద్దే ఉన్నా సీఎం ఏనాడూ వాటిపై సమీక్షించలేదని విమర్శించారు. పురుగుల అన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా సీఎం పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. '11 నెలల్లో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు..కలెక్టర్లూ.. కనీసం మీరైనా బడులను చూడండి' అని సూచించారు.గుడ్ల పంపిణీ నిలిచి పోయిందని, బిల్లులు రాక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారని, మధ్యాహ్న భోజన కార్మికులు 11 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారని వాపోయారు.

### చుక్కా రామయ్యకు హరీశ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమకారుడు, తెలంగాణవాది, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యకు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ఫోన్‌చేసి మాట్లాడారు. 'సమాజానికి మీరు అందించిన విద్య, సామాజిక సేవలు ఎంతో గొప్పవి. మీ సేవలు తెలంగాణ సమాజానికి మరింతగా ఉపయోగపడాలి. ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## నేడు ఖమ్మానికి హరీశ్‌రావు రాక

- రెండు రోజులపాటు జిల్లాలో మాజీ మంత్రి హరీశ్ పర్యటన
- ఖమ్మంలో కొవ్వొత్తుల ర్యాలీ, వ్యవసాయ మార్కెట్ సందర్శన
- చింతకాని మండలంలో రైతుల కుటుంబాలకు పరామర్శ

ఖమ్మం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మాజీ మంత్రి హరీశ్‌రావు గురువారం ఖమ్మానికి రానున్నారు. గురు, శుక్రవారాల్లో ఖమ్మం నగరంతోపాటు చింతకాని మండలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహా ఇతర నేతలు ఇప్పటికే సన్నాహక పనులను పూర్తిచేశారు. లగచర్ల రైతులకు మద్దతుగా ఖమ్మంలో నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారు. ఆ తరువాత పత్తి, మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిస్తారు. అనంతరం చింతకాని మండలంలో రైతులను పరామర్శిస్తారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పిలుపునిచ్చారు.